పెద్దకోడూరులో మహిళలుకు ఉచితంగా కుట్టుమిషన్లను అందజేస్తున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

కాంగ్రెస్ వచ్చి.. కరువు తెచ్చింది

- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

చిన్నకోడూరు, మార్చి 11: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి.. రాష్ట్రంలో కరువు తెచ్చిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సోమవారం చిన్నకోడూరులో రూ.20 లక్షలతో నిర్మించిన గౌడ కమ్యూనిటీ భవనాన్ని ప్రారంభించి పెద్ద కోడూరుతో పాటు చంద్లాపూర్ గ్రామాలకు చెందిన మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లను జడ్పీ చైర్ పర్సన్ వేలేటి రోజాశర్మతో కలిసి ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నలభై ఏండ్లలో పూర్తి చేయలేని ప్రాజెక్టులను నాలుగేండ్లలో పూర్తిచేయించి తెలంగాణ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేశారన్నారు. చెరువు కట్టలపై ఈత, తాటి వనాలు పెంచడంతో కల్లు గీత కార్మికులకు ఆదాయం పెరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కూర మాణిక్యరెడ్డి, సొసైటీ చైర్మన్లు కనకరాజు, సదానందంగౌడ్, వైస్ ఎంపీపీ పాపయ్య, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు శ్రీనివాస్, ఎంపీటీసీలు దుర్గారెడ్డి, శారద, సాయన్న, సీనియర్ నాయకులు తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, రామచంద్రం, బీఆర్ఎస్ యువజన విభాగం మండల అధ్యక్షుడు వేణు, ఉమేశ్‌చంద్ర, లింగం, రవీందర్ రెడ్డి, ఏపీఎం మహిపాల్, నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

- సిద్దిపేట సీపీ అనురాధ

మహిళా పోలీస్ అధికారులు, సిబ్బందిని సన్మానిస్తున్న సీపీ అనురాధ

సిద్దిపేట అర్బన్, మార్చి 11: మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ బి.అనురాధ అన్నారు. సోమవారం సిద్దిపేట పట్టణ శివారులోని పోలీస్ కన్వెన్షన్ హాల్‌లో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. జిల్లాలోని మహిళా పోలీస్ అధికారులు, సిబ్బంది మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మహిళలు అనుకుంటే సాధించలేనిది ఏదీలేదన్నారు. తల్లిగా, చెల్లిగా, అక్కగా, భార్యగా ఎన్నో బాధ్యతలు మోస్తూ సమాజానికి, కుటుంబానికి మార్గదర్శకంగా మహిళలు నిలుస్తున్నారని గుర్తుచేశారు. కమిషనరేట్ పరిధిలో మహిళలు, పిల్లల సంరక్షణ కోసం ప్రత్యేకంగా షీ టీమ్స్ ఏర్పాటు చేసి.. ప్రతి మహిళకు రక్షణ కల్పించే విధంగా తగు చర్యలు తీసుకోవడం జరుగతుందన్నారు. అనంతరం డిపార్ట్‌మెంట్‌లో ఉత్తమ సేవలు అందించిన పలువురు మహిళా సిబ్బందిని అభినందించి శాలువా, జ్ఞాపికలతో ఆమె సన్మానించారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మ ప్రోత్సాహం చాలా ఉంది

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట అర్బన్, మార్చి 11: తన ఎదుగుదలలో మా అమ్మ ప్రోత్సాహం చాలా ఉందని.. సివిల్స్ వైపు అడుగులు వేయడానికి చిన్నప్పటి నుంచి అమ్మ ఇచ్చిన మోటివేషన్, గైడెన్స్‌లే కారణమని కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చిన్నప్పటి నుంచి తల్లిదండ్రులు అమ్మాయిలకు ఆత్మవిశ్వాసం కలిగిస్తే పెద్దయిన తర్వాత అన్ని రంగాల్లో రాణిస్తారన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ అంగన్‌వాడీ టీచర్లు, అంగన్‌వాడీ హెల్పర్లను కలెక్టర్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

గజ్వేల్, మార్చి 11: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని రిమ్మనగూడలో రూ. 5లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదల కోసం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ పథకం వర్తింపజేస్తామన్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో సీసీ రోడ్ల పనులు కొనసాగుతున్నాయన్నారు. రాబోయే రోజుల్లో కూడా నియోజకవర్గంలోని గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు నాయిని యదగిరి, మల్లారెడ్డి, నరేందర్‌రెడ్డి, మోహన్, శ్రీధర్, వెంకట్‌గౌడ్, కాంపల్లి శ్రీనివాస్, నర్సింహులు, స్వామి, మాధవరావు పాల్గొన్నారు.

తాగునీటికి ఇబ్బందులు రానివ్వొద్దు

అక్కన్నపేట, మార్చి 11: తాగునీటికి ఇబ్బందులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ మాలోతు లక్ష్మీబీలూనాయక్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఆమె సంబంధిత అధికారులతో కలిసి నీటి ఎద్దడి నివారణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ గోదావరి జలాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. మండలంలోని కట్కూరు, మోత్కులపల్లి, మల్లంపల్లి తదితర గ్రామాల్లో మిషన్ భగీరథ నీటి సరాఫరాలో అంతరాయం కలుగుతుందని ఆయా గ్రామాల ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు అమె దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి మహేశ్, ఎంపీడీవో భానోతు జయరామ్, ఎంపీవో కవి కుమార్, అక్కన్నపేట ఎంపీటీసీ పెసరు సాంబరాజు, మిషన్ భగీరథ డీఈ, ఏఈలు, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి సహకారం అందిస్తా

సిద్దిపేటలో శ్రీరామ కల్యాణ మండపాన్ని పారంభిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు



సిద్దిపేటలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట టౌన్, మార్చి 11: సిద్దిపేట గణేశ్ నగర్ ప్రసన్నాంజనేయ స్వామి మహిమగల స్వామిగా విరాజిల్లుతున్నదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. స్వామివారి ఆలయ సన్నిధిలో నూతనంగా నిర్మించిన శ్రీరామకల్యాణ మండపాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇప్పటికే శాశ్వత అన్నదాన సత్రాన్ని నిర్మించుకున్నామన్నారు. భవిష్యత్‌లోనూ ఆలయ అభివృద్ధికి తన వంతు సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే హరీశ్‌రావుకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. స్వామి వారిని ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పూజల వెంకటేశ్వరరావు, మచ్చవేణుగోపాల్‌రెడ్డి, సాయిరామ్, శ్రీనివాస్‌గౌడ్, కౌన్సిలర్ కాటం శోభ, సుందర్, బచ్చు రమేశ్, ఆలయ అర్చకుడు వెంకట రమణాచార్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఏకలవ్యుల అభ్యున్నతికి కృషి చేస్తా

సిద్దిపేట,మార్చి11: ఏకలవ్యుల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తానని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సోమవారం సిద్దిపేట పట్టణంలో రూ.5 లక్షలతో ఏకలవ్య మిత్రమండలి భవనానికి ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సత్యనారాయణ ఎమ్మెల్సీ నియామకాన్ని గవర్నర్ రిజెక్ట్ చేసే అధికారం లేదని పునర్ పరిశీలించాలని హైకోర్టు చెప్పిందన్నారు. సుమారు రూ. కోటి 10 లక్షలతో సిద్దిపేటలో ఏకలవ్య భవనం నిర్మించుకున్నామన్నారు. సిద్దిపేట ప్రతిష్టను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అభివృద్ధిలో సిద్దిపేటను అన్నిరంగాల్లో ముందుకు తీసుకువెళ్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఫరూఖ్ హుస్సేన్, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, నాయకులు పాల చాయిరామ్, వేణుగోపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, వరాల సురేశ్, దాసరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పలు కుటుంబాలకు పరామర్శ

సిద్దిపేట, మార్చి11: పలు కుటుంబాలను మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు సోమవారం పరామర్శించారు. సిద్దిపేట రూరల్ మండలం రాంపూర్ మాజీ సర్పంచ్ భిక్షపతి తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. అర్బన్ మండలం ఎన్‌సాన్‌పల్లి మాజీ సర్పంచ్ రవీందర్‌గౌడ్ తల్లి మరణించగా వారి కుటుంబాలను ఎమ్మెల్యే హరీశ్‌రావు పరామర్శించారు. సిద్దిపేట పట్టణానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త పరశురాములు గుండెపోటుతో మృతిచెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యే వెంట సుడా మాజీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్ నాయిని చంద్రం ఉన్నారు.

బాండ్ల వివరాలు బహిర్గతం చేయాలి

చేర్యాల ఎస్‌బీఐ ఎదుట ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

సిద్దిపేట ఎస్‌బీఐ ఎదుట నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

చేర్యాల, మార్చి 11 : ఎన్నికల బాండ్ల వివరాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం చేర్యాల పట్టణంలోని ఎస్‌బీఐ ఎదుట సీపీఎం ఆందోళన నిర్వహించింది. సుప్రీంకోర్టు ఆదేశం మేరకు ఎస్‌బీఐ చైర్మన్ ఎన్నికల బాండ్ల వివరాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కొంగరి వెంకట్‌మావో, పట్టణ కార్యదర్శి రాళ్లబండి నాగరాజు, నాయకులు బండకింది అరుణ్‌కుమార్, ముస్యాల ప్రభాకర్, బోయిని మల్లేశం, ఆముదాల నర్సిరెడ్డి, ఇప్పకాయల శోభ, రవీందర్, అశోక్ పాల్గొన్నారు.

సీపీఎం నాయకుల నిరసన

సిద్దిపేట, మార్చి11: సీపీఎం కేంద్ర కమిటీ పిలుపు మేరకు ఎస్‌బీఐ ఎదుట ధర్నా చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు రాళ్లబండి శశిధర్, గోపాలస్వామి, నాయకులు రవికుమార్, దాసరి ప్రశాంత్, కనకయ్య, అరవింద్, సంజీవ్, షారుఖ్, బాలు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ చైర్మన్‌ను వెంటనే అరెస్టు చేయాలి

గజ్వేల్, మార్చి 11: గజ్వేల్ పట్టణంలోని ఎస్‌బీఐ ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్.ఎల్లయ్య , నాయకులు రంగారెడ్డి, వెంకట్‌చారి, అష్టల్, నర్సింహులు, మహేందర్, లక్ష్మణ్ ఉన్నారు.

దుబ్బాకలో...

దుబ్బాక, మార్చి11: దుబ్బాక ఎస్‌బీఐ ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సీపీఎం జిల్లా కార్యదర్శి జి.భాస్కర్ , నాయకులు లక్ష్మీనర్సయ్య, సాజీద్, రాజు, మహేశ్, రవి, మల్లేశం, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కదనభేరికి తరలిరండి

హుస్నాబాద్, మార్చి 11: కరీంనగర్‌లోని ఎస్ఆర్ఆర్ కళాశాల మైదానంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహిస్తున్న కరీంనగర్ కదనభేరి బహిరంగ సభకు హుస్నాబాద్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు తరలిరావాలని మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. సాయంత్రం 4 గంటలకు ప్రారంభమయ్యే సభకు తెలంగాణ తొలి సీఎం, బీఆర్ఎస్ అధ్యక్షులు కేసీఆర్ హాజరవుతారని తెలిపారు. నియోజకవర్గంలోని హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ, చిగురుమామిడి, సైదాపూర్, ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాల నుంచి బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, అభిమానులు, ప్రజలు తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు.

బీఆర్ఎస్ మండల అధ్యక్షుడిగా మధుసూదన్‌రెడ్డి

మధుసూదన్‌రెడ్డిని సన్మానిస్తున్న వొడితెల సతీశ్‌కుమార్

హుస్నాబాద్, మార్చి 11: బీఆర్ఎస్ హుస్నాబాద్ మండల అధ్యక్షుడిగా మండలంలోని రాములపల్లికి చెందిన గంగం మధుసూదన్‌రెడ్డిని నియమిస్తూ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం హుస్నాబాద్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో మధుసూదన్‌రెడ్డిని సతీశ్‌కుమార్‌తో పాటు జిల్లా పరిషత్ వైస్‌చైర్మన్ రాజిరెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు వెంకట్రామ్‌రెడ్డి, నాయకులు తిరుపతిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శ్రీకాంత్, సంపత్, రాంరెడ్డి పాల్గొన్నారు.

తూతూమంత్రంగా సర్వసభ్య సమావేశం

సిద్దిపేట అర్బన్, మార్చి 11: సిద్దిపేట అర్బన్ మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం తూతూమంత్రంగా కొనసాగింది. ఈ సర్వసభ్య సమావేశానికి సగానికి పైగా అధికారులు గైర్హాజరయ్యారు. ముందుగా వ్యవసాయశాఖ, విద్యుత్ శాఖ, వైద్యారోగ్యశాఖ, పంచాయతీరాజ్ శాఖలపై అధికారులు వారి పురోగతి వివరించారు. ఆరు గ్యారెంటీల్లో భాగంగా ఎవరైనా లబ్ధిదారులకు పథకాలు వర్తించకపోతే మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మార్టిన్ లూథర్, ఎంపీవో శ్రీనివాసరావు, పీఏసీఎస్ చైర్మన్ చింతల శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశం వాయిదా

మద్దూరు(ధూళిమిట్ట), మార్చి11: మద్దూరు మండలంలోని రేబర్తి ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన పాలకవర్గ సమావేశం కోరం లేక వాయిదా పడింది. మొత్తం 13మంది సభ్యుల్లో చైర్మన్ నాగిళ్ల తిరుపతిరెడ్డితో పాటు మద్దూరు డైరెక్టర్ కాటం బాలయ్య మాత్రమే సమావేశానికి హాజరయ్యారు. సమావేశంలో గత ఆర్థిక సంవత్సరంలో చేసిన లావాదేవీలు, మహాజన సభ ఏర్పాటు తదితర అంశాలపై చర్చించాల్సి ఉండగా 11మంది సభ్యులు గైర్హాజరయ్యారు. 1/3వంతు సభ్యులు హాజరు కాకపోవడంతో కోరం లేనందున సమావేశాన్ని వాయిదా వేసినట్లు పీఏసీఎస్ సీఈవో బోయిని శ్రీధర్ తెలిపారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న యాదవరెడ్డి

గజ్వేల్, మార్చి 11: కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి అన్నారు. సోమవారం వ్యవసాయ మార్కెట్ యార్డులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించిన సందర్భంగా మాట్లాడారు. ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.6760 ధర నిర్ణయించిందని, దళారులకు విక్రయించి నష్టపోవద్దన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ జెజాల వెంకటేశంగౌడ్, మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, మండల వైస్ ఎంపీపీ కృష్ణగౌడ్, ఏఎంసీ కార్యదర్శి జానవెస్లీ, ఏవో నాగరాజు, పీఏసీఎస్ సీఈవో బాలయ్య, వైస్ చైర్మన్ జకీ యొద్దీన్, నాయకులు రవీందర్‌రెడ్డి, గొడుగు స్వామి, పీఏసీఎస్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

మున్సిపల్‌లో సాధారణ సమావేశం

సిద్దిపేట, మార్చి 11: సిద్దిపేట మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ మంజులా రాజనర్సు అధ్యక్షతన సోమవారం సాధారణ సమావేశం నిర్వహించారు. అభివృద్ధి పనులకు సంబంధించిన 10అంశాలను ప్రవేశపెట్టగా, సభ్యులు ఆమోదం తెలిపారు. మరికొందరు వార్డుల్లోని సమస్యలను వివరించగా చైర్‌పర్సన్ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ కనకరాజు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, హెల్త్ డిపార్ట్‌మెంట్ అధికారులు, విద్యుత్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

'తపాలా'లో దాచుకున్న సొమ్ము ఇవ్వడంలేదు

హుస్నాబాద్‌టౌన్, మార్చి 11: తపాలా కార్యాలయంలో కిసాన్ వికాస పత్రం కింద ఫిక్స్‌డ్ చేసిన సొమ్మును కాలపరిమితి ముగిసినప్పటికీ ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ సుధాకర్ వాపోయారు. ఈ విషయంపై సోమవారం స్థానిక తపాలా కార్యాలయంలో ఎస్‌పీఎం అంజయ్యను నిలదీశారు. 2015లో తన భార్య పేరిట రూ.40వేలను హుస్నాబాద్ తపాలా కార్యాలయంలో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశానని, ఆ డబ్బులు గతేడాది నవంబర్‌లో రూ. 80వేలు ఇవ్వాల్సి ఉండగా ఇవ్వడం లేదని ఆరోపించారు. బాండ్లను ఆన్‌లైన్ చేసి ఇస్తామంటూ చెప్పి నాలుగు మాసాలు గడుస్తున్నా ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని సుధాకర్, మాజీ కౌన్సిలర్ రవీందర్ ఎస్‌పీఎంను ప్రశ్నించారు. సమాధానం చెప్పకుండా నిర్లక్ష్యంగా మాట్లాడడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. డబ్బులు దాచుకుంటే స్వాహా చేశారనే అనుమానం ఉందని వారు ఆరోపించారు. స్థానిక తపాలాకార్యాలయంలో జరుగుతున్న విషయాన్ని వారు జిల్లా అధికారులకు ఫోన్ ద్వారా వివరించి ఇందుకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్‌పీఎం అంజయ్య శుక్రవారం వరకు డబ్బులు ఇప్పిస్తామంటూ హామీ ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది.

భూసేకరణ త్వరగా పూర్తి చేయాలి

- కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి

సిద్దిపేట అర్బన్, మార్చి 11: చిన్నకోడూరు మండలంలో రైల్వేలైన్ ఏర్పాటుకు, మెదక్-ఎల్కతుర్తి జాతీయ రహదారి నిర్మాణంలో కోహెడ మండలం బస్వాపూర్, హుస్నాబాద్ మండలం పందిళ్ల వద్ద భూసేకరణ త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ మేరకు ధరణి పెండింగ్ దరఖాస్తులు, భూసేకరణ, రానున్న లోక్‌సభ ఎన్నికల సన్నద్ధతపై అధికారులతో చర్చించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. రానున్న లోక్‌సభ ఎన్నికల నిర్వహణ సందర్భంగా ఎలాంటి ఇబ్బంది కలుగకుండా పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ బెన్‌షాలెం, అధికారులు పాల్గొన్నారు.

గృహజ్యోతి.. మహాలక్ష్మికోసం పాట్లు

హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయంలో క్యూలో ఉన్న లబ్ధిదారులు

మద్దూరు ఎంపీడీవో కార్యాలయంలో పడిగాపులు కాస్తున్న జనాలు

హుస్నాబాద్‌టౌన్, మార్చి 11: గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాలను అర్హులైన వారికి వర్తింపజేయడంలో అధికారులు విఫలమయ్యారు. దీంతో ప్రజలు మరోసారి దరఖాస్తులతో కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తున్నది. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కేంద్రానికి నిత్యం అనేకమంది తమకు గృహజ్యోతి, మహాలక్ష్మి రాలేదంటూ మళ్లీ దరఖాస్తులు చేసుకుంటున్నారు. వృద్ధులు, మహిళలు ఈ కేంద్రాల్లో గంటల తరబడి పడిగాపులు పడాల్సి వస్తున్నది. మరోసారి ఆన్‌లైన్ నమోదు చేసే ప్రక్రియలో సాంకేతిక కారణాలు తరుచూ ఎదురవుతుండటంతో ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తున్నది.

మద్దూరు మండలంలోనూ..

మద్దూరు(ధూళిమిట్ట), మార్చి 11: గృహజ్యోతి పథకం కోసం ఉమ్మడి మద్దూరు మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు సోమవారం మద్దూరు మండల పరిషత్ కార్యాలయంలో గంటలకొద్ది వేచిచూశారు. ప్రజాపాలన దరఖాస్తుల్లో దొర్లిన తప్పుల చేత చాలామందికి గృహజ్యోతి పథకం వర్తించడం లేదు. 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించుకున్నా జీరో బిల్లు రాకపోవడంతో మరోసారి దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం వెసులుబాటు ఇవ్వడంతో ప్రజలంతా మండల పరిషత్ కార్యాలయంలో బారులు తీరారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్ల వద్ద దరఖాస్తులలో దొర్లిన తప్పులను అధికారులు సరిచేస్తున్నారు.

ఆలయ అభివృద్ధికి కొమ్మూరి కృషి

చేర్యాల, మార్చి 11 : కొమురవెల్లి మల్లన్న ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు మాజీ ఎమ్మెల్యే, జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి కృషి చేస్తుంటే ఓర్వలేని కొందరు చౌకబారు విమర్శలు చేస్తున్నారని మల్లన్న ఆలయ పునరుద్ధరణ కమిటీ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం ఆయన ప్రతికా ప్రకటన విడుదల చేశారు. మహాశివరాత్రి సందర్భంగా కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి పూజలు చేసుకునేందుకు ఆలయానికి వస్తే దానిని సైతం కొందరు వ్యక్తులు కొమ్మూరి చీకటి వ్యవహారం నడిపారని, మాంసాహారాలు తిన్నారని ఆరోపించడం వారి అవివేకానికి నిదర్శమన్నారు. రెండు రోజుల్లో కొమ్మూరిపై చేసిన ఆరోపణలు నిరూపించాలని, లేనిపక్షంలో వారి ఇండ్లను ముట్టడించి తగిన గుణపాఠం చెబుతామన్నారు. ఆయనతో కమిటీ సభ్యులు మేడికంటి శ్రీనివాస్, ముస్యాల దామోదర్, అంబాల శ్రీనివాస్, అల్లం శ్రీనివాస్, బచ్చల శ్రీనివాస్, రమణారెడ్డి, మోహన్‌రెడ్డి ఉన్నారు.

ముగిసిన జాతర

మద్దూరు(ధూళిమిట్ట), మార్చి 11: ధూళిమిట్ట మండలంలోని కొండాపూర్‌లో ఈనెల 8న ప్రారంభమైన గట్టు మల్లన్న జాతర సోమవారం ముగిసింది. తెల్లవారుజామున గట్టు మల్లన్నకు కొండాపూర్ యాదవులు పెద్దపట్నం వేశారు. అర్చకులు కొట్టె రాజమౌళి, మహేశ్ ఆధ్వర్యంలో వీరశైవ ఆగమశాస్త్రం ప్రకారం మేడలమ్మ, కేతమ్మ సహిత మల్లన్న కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అంతకుముందు అగ్నిగుండాల ప్రవేశాన్ని నిర్వహించారు. భక్తులు బోనాలు చేసి మల్లన్నకు నైవేద్యంగా సమర్పించారు.

తోపుడు బండ్ల తొలిగింపు

చేర్యాల, మార్చి 11: కొమురవెల్లి మల్లన్న క్షేత్రంలో తోపుడు బండ్లను ఆలయ వర్గాలు పోలీసుల సహకారంతో సోమవారం తొలిగించారు. ఆర్జిత సేవల టికెట్లు, ప్రసాదాల కొనుగోలు చేసే ప్రదేశంలో ఉన్న భవనం ఇరువైపులా, ఎగ్జిట్ గేట్ ప్రాంతంలో తోపుడు బండ్లు, సోడా విక్రయ బండ్లు తదితర వాటిని చిరు వ్యాపారులు ఏర్పాటు చేసుకున్నారు. భక్తుల ఇబ్బందులు గుర్తించిన ఆలయ వర్గాలు వాటిని పోలీసుల సహకారంతో తొలిగించారు.

భారీగా దరఖాస్తులు

హుస్నాబాద్‌టౌన్, మార్చి 11: హుస్నాబాద్ పశువుల అంగడి వేలానికి సోమవారం భారీగా దరఖాస్తులు వచ్చాయి. ఈనెల 12న హుస్నాబాద్ పశువుల అంగడివేలాన్ని మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించనున్నారు. వేలంలో పాల్గొనేవారికి సోమవారం చివరిరోజు కావడంతో పెద్దసంఖ్యలో దరఖాస్తులు అందాయి. సాయంత్రం ఐదుగంటల వరకు 21మంది దరఖాస్తు చేసుకోగా వారినుంచి రూ. కోటి ఐదు లక్షలు వచ్చాయని ఇన్‌చార్జి ఆర్ఐ జాలిగాం శంకర్ తెలిపారు.

బీరువా బహూకరణ

కొండపాక(కుకునూరుపల్లి), మార్చి 11: కొండపాక మండలంలోని సిరిసినగండ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు క్రియేటివ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కీ.శే. గాజుల శ్రీనివాస్ జ్ఞాపకార్థం బీరువాను బహూకరించారు. జిల్లా క్రియేటివ్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు లింగ శ్రీనివాస్ మాట్లాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు విఠల్, క్రియేటివ్ టీచర్స్ అసోసియేషన్ సభ్యులు, టీచర్లు పాల్గొన్నారు.

ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజానికానికి తెలియజేయునది ఏమనగా, పస్తం బాబు, S/o. వలయ్య, Age: 29 సం॥రాలు., Occ: Business, H.No. 7-46/1, BC COLONY, KANNALA PALAKURTHY, PEDDAPALLI గ్రామము, బూర్గుపల్లి గ్రామ పంచాయతి బూర్గుపల్లి మండలం సిద్దిపేట జిల్లా సిద్దిపేట్ సబ